క్లుప్తంగా

ఆదోనివాసికి సేవా అవార్డు



జోనాథన్‌కు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ వారు తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా మంథానిలో జరిగిన ఉగాది నందీశ్వర అవార్డుల ప్రదానోత్సవంలో పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి జోనాథన్‌కు పురస్కారం అందజేశా. సామాజికసేవా రంగంలో ఆయన ఎన్నోసార్లు రక్తదానం చేసినందుకు జాతీయస్థాయి ప్రతిభా పురస్కారంతో స్ఫూర్తి శక్తి అనే బిరుదును ఆదివారం అందజేశారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల కరస్పాండెంట్ దైవాదీనంరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్ సోమవారం ఆయనను అభినందించారు.

బీమా తక్షణ సాయం అందజేత

పెద్దకడబూరు : మండల కేంద్రానికి చెందిన జయమ్మ (40) అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందింది. ఆమెకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరైంది. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా ఆమె కుటుంబసభ్యులకు సర్పంచ్ రామాంజినేయులు, సచివాలయ సిబ్బంది శ్రావణి సోమవారం రూ.10వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ మిగిలిన మొత్తం రూ. 90వేలు నామిని బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కోసిగి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, నాయకులు అర్లప్ప, అనిల్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి



సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : ముందస్తు అక్రమ అడ్మిషన్లు అరికట్టాలని, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేయిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్, పీడీఎస్ఓ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆదోని డివిజనల్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు మల్లికార్జున, పీడీఎస్ఓ కన్వీనర్ తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ మాస్ కాపీయింగ్ చేయిస్తున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. స్పందించిన సబ్‌కలెక్టర్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు.

తప్పిన ముప్పు



ప్రమాదకరంగా పైకి లేచిన ఆటో

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని కొండాపురం ఆంజనేయస్వామి గుడి సమీపంలో చెరుకు లోడుతో మాధవరం నుంచి మంత్రాలయం వస్తున్న ఆటో అధిక లోడు కారణంగా ప్రమాదవశాత్తు పైకి లేచింది. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే ఆటోను చాకచక్యంగా రోడ్డు పక్కకు నిలిపివేశాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారుల సహాయంతో కిందకు దింపుకున్నాడు. వారు స్పందించడంతో ప్రమాదం తప్పింది.

25న పంచాయతీ వేలం పాట

హొళగుంద: హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన వేలం పాటలు ఈ నెల 25న సర్పంచ్ మాల రంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీకి సంబంధించిన వారపు సంత మార్కెట్, బస్టాండు, కమేళా, సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్ ఏడాది నిర్వహణకు గాను వేలం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే స్థానిక బస్టాండులోని 5 హోటల్ స్థలాలకు మూడేళ్ల లీజుకు సంబంధించి వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వాటర్‌ప్లాంట్‌కు రూ.5 వేలు, మిగతా వాటికి సాల్వెన్సు (సొంత ఆస్తులు ఉన్న వారు) రూ.50 వేలు, రూ.లక్ష ప్రకారం డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. సాల్వెన్సు లేని వారు రూ.70 వేలు, రూ.2 లక్షలు ప్రకారం డిపాజిట్ చేయాలని చెప్పారు. వేలంలో హక్కులు దక్కించుకున్న వారు నిబంధనలు పాటించాలని, పాడిన మొత్తంతో పాటు మూడు శాతం స్టాంపు డ్యూటీ అదనంగా వెంటనే చెల్లించాలని చెప్పారు. గతంలో వేలం పాటల్లో పాల్గొని నేటికి పంచాయతీకి బకాయి ఉన్న వారిని అనుమతించబోమని స్పష్టం చేశారు.

22న జనార్దన స్వామి రథోత్సవం

ఆస్పరి: ఉగాది పండుగ సందర్భంగా ఆస్పరిలో వెలసిన జనార్దన స్వామి రథోత్సవం ఈనెల 22న నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గురువారం నుగ్గులాట, శుక్రవారం వసంతోత్సవం, ఉట్లోత్సవంతో స్వామి వారి ఉత్సవాలు ముగుస్తాయన్నారు.



నక్షత్ర మండలాకార ఆలయం

గ్రహపీడ దోషాలు తొలగుతాయి



గ్రహపీడ దోషాలు ఉన్న వారు, ఏ నక్షత్రంలోనైనా, ఏ రాశిలో ఉన్న వారైనా సరే నక్షత్ర మండలాకారంలో ఉన్న కోదండ రామస్వామి వారిని దర్శించుకుంటే దోషాలు తొలగిపోతాయి. అన్ని నక్షత్రాలున్న మండలం కాబట్టి ఎంతో శక్తిగల మహావిష్ణువు అంశం శ్రీకోదండస్వామి వారిని పాండవులు తమ అజ్ఞాతవాసంలో ప్రతిష్ఠించారు. 12 రాశుల్లోని ఏ రాశి వారైనా ఈ ఆలయాన్ని దర్శించుకుంటే పరిహారమవుతుందని నమ్మకం.

– గరుడాద్రి దత్తాత్రేయశర్మ, వేదపండితుడు

కల్యాణ మండపం నిర్మాణానికి టీటీడీకి ప్రతిపాదన



ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి టీటీడీకి ప్రతిపాదనలు పంపాం. ఆలయం వద్ద పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, పార్కింగ్, మంచి సంస్కారం ఇచ్చేందుకు బాల సంస్కార కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం టీటీడీ ద్వారా రూ.16 లక్షల గ్రాంటు మంజూరు చేసింది. ఈ నిధులతో దేవతా కల్యాణ మండపాన్ని నిర్మిస్తాం. నక్షత్రవనం ఏర్పాటు చేస్తాం.

– రామాంజనేయులు, విరాట్ హిందుస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆలయంలో వెలసిన శ్రీ జానకీ సమేత కోదండరామ, లక్ష్మణ స్వాములు



సీతారామ దర్శనం.. పాపహరణం

- ద్వాపర యుగంలో పాండవులతో నిర్మితమైన నక్షత్ర మండలాకార శ్రీ కోదండ రామాలయం
- ఉగాది నుంచి తొమ్మిది రోజులపాటు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు
- రామాలయాన్ని దర్శిస్తే గ్రహపీడ తొలగుతుందని భక్తుల నమ్మకం
- బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్న మంత్రాలయం పీఠాధిపతి
- చివరి రోజు చినజీయర్ స్వామి రాక
- శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణోత్సవం
- 31న పట్టాభిషేకం

ఆదోనిఅర్బన్ : పెద్దతుంబళం గ్రామంలో వెలసిన నక్షత్ర మండలాకార శ్రీ కోదండరామాలయం ఎంతో విశిష్టత గలది. ద్వాపరయుగంలో తమ వనవాస సమయంలో పాండవులు ఇక్కడ కొంతకాలం ఉండి ఈ ఆలయాన్ని నిర్మించారని చరిత్ర పేర్కొంటోంది. ఈ ఆలయాన్ని సందర్శిస్తే గ్రహదోషాలు తొలగుతాయని భక్తుల నమ్మకం. ఈ ఆలయంలో ఏటా ఉగది సందర్భంగా బ్రహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ప్రస్తుతం ఉత్సవాలకు ఆలయం సిద్ధమైంది.

ఉగాది నుంచి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు

మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో వెలిసిన శ్రీ జానకీసమేత కోదండరామ లక్ష్మణస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఉగాది నుంచి తొమ్మిది రోజులపాటు జరగనున్నాయి. ఉగాది రోజున మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ మహాస్వాములు ధ్వజారోహనంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్నారు. ఆ రోజున స్వామివార్లకు గోపూజ, ఫలపంచామృతాభిషేకం, గణపతి హోమం, పల్లకీ సేవ, ఉగాది పంచాంగ శ్రవణం, విష్ణు సహస్తనామ స్తోత్ర పారాయణం పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఇలా ప్రతిరోజూ తొమ్మిది రోజులపాటు హోమాలు, పారాయణం, తొమ్మిది వాహనాలతో పల్లకీ సేవలు, సాయంత్రం పూట నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఆయా మఠం పీఠాధిపతులు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శ్రీరామనవమి రోజున సాయంత్రం సీతారామ కల్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 31వ తేదీన కోదండరామస్వాముల వారికి పట్టాభిషేకం కార్యక్రమం వేడుకగా జరగనుంది.

ఆలయ చరిత్ర..

పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ఈ దేవాలయానికి సమీపాన ఉండే గ్రామంలో గడిపారు. అందుకే ఆ గ్రామానికి పాండవుల ఇళ్లు అనే పేరు లభించింది. అదే కాలక్రమేణా పాండవగల్లుగా మారిందని చరిత్ర చెబుతోంది. గ్రామ సమీపంలో శ్రీ జానకీసమేత కోదండ రామాలయాన్ని నక్షత్ర మండలాకారంలో పాండవులు నిర్మించారు. అయితే కాలక్రమేణా ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాదాపు 1300 సంవత్సరాల క్రితం పశ్చిమ కళ్యాణచాళుక్య రాజైన పుళకేసి మహారాజు పునర్నిర్మించారు. అప్పటి నుంచి ఈ ఆలయాన్ని కళ్యాణ చాళుక్యరాజులు, బుక్కరాయులు, వ్యాసరాయతీర్థులు, శ్రీకృష్ణదేవరాయలు, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి తదితర మహాత్ములెందరో దర్శించుకున్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వారికి గ్రహపీడ దోషాలు తొలగి శీఘ్ర ఫలితం ఉంటుందనేది నిరూపితమైందని పండితుడు గరుడాద్రి దత్తాత్రేయ శర్మ తెలిపారు. ఇంతటి మహాద్భుత చరిత్ర కలిగిన ఈ కోదండ రామాలయం గురించి తెలుసుకున్న ప్రభుత్వం చరిత్ర వారసత్వ అవార్డు (హెరిటేజ్)ను ప్రకటించింది. ఈ ఆలయాన్ని 2011లో పరిపూర్ణానందస్వామి, 2021లో చినజీయర్‌స్వామి వారు దర్శించుకున్నారు. చిన్నజీయర్‌స్వామి వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి ఆలయ అభివృద్ధికి రూ.16 లక్షలను టీటీడీ ద్వారా గ్రాంటు మంజూరు చేయించారు. అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల్లో ఆలయ ప్రాంగణంలో భూమి నుంచి శ్రీ యోగా నరసింహస్వామి, గోపాలకృష్ణస్వామి విగ్రహాలు బయల్పడ్డాయి.

ఎలా వెళ్లాలి..

నక్షత్ర మండలాకార ఆలయానికి వెళ్లేందుకు ఆదోని పట్టణం నుంచి 20 కి.మీ. దూరం ఉంటుంది. పట్టణంలోని ఆర్టగేరి బస్టాండు వద్ద మాధవరం, మంత్రాలయం వెళ్లే బస్సులో పెద్ద తుంబళం వెళ్లవచ్చు.

మూడు స్థానాలకే మురిసిపోవద్దు

- వైఎస్సార్‌సీపీ గెలిచిన స్థానాలు 11



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో 3స్థానాలు గెలిచినందుకే జబ్బలు చరుచుకోవడమా.. విడ్డూరంగా ఉంది.. వైఎస్సార్‌సీపీ 11 స్థానాల్లో గెలిచిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవెలప్‌మెట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లల్లో వైఎస్సార్‌సీపీనే ముందంజలో ఉందన్నారు. కానీ తెలుగుదేశం పార్టీ వాళ్లు ఇతర పార్టీ వాళ్ల ఓట్లును కలుపుకొని రెండో ప్రాధాన్యత ఓటుతో గెలుపొందారని గుర్తు చేశారు. వార్డ్ మెంబర్‌గా కూడ గెలవని తిక్కారెడ్డి, రమాకాంత్‌రెడ్డి రెచ్చగొట్టే మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సిగ్గులేని చర్యగా అభివర్ణించారు. టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలో మొట్టమొదట సారిగా ఒక రాజకీయ పార్టీ గెలుపొందడం చరిత్రాత్మకమన్నారు. సర్పంచ్ రామాంజనేయులు, కోగిసి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: పులికనుమ రిజర్వాయర్ నుంచి నాకన్న చెరువు వరకు సాగునీటి పైప్‌లైన్ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు రైతుల సమక్షంలో సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి మాట్లాడుతూ పులికనుమ మిగులు బడ్జెట్‌లో రూ.6కోట్లతో రిజర్వాయర్ వద్ద నుంచి నాకన్న చెరువు, చింతకుంట వరకు 5.5 కి.మీ. రెండున్నర అడుగుల పైప్‌లైన్ వేయిస్తున్నట్లు తెలిపారు. పైప్‌లైన్ పనులను జూన్ ఆఖరిలోగా పూర్తి చేసి ఖరీఫ్ పంటలకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పైప్ లైన్ పనులు వేగవంతం చేసేందుకు పంట పొలాల రైతుల సహకరించాలని కోరారు. పనులు పూర్తయితే మండలంలోని కోసిగి, పెండేకల్లు, నాకన్న చెరువు, పీకలబెట్ట, నేలకోసిగి, దేవర బెట్ట, చింతకుంట గ్రామ పొలాలు దాదాపు 2,500 ఎకరాలకు పుష్కలంగా సాగునీరు అందనుందన్నారు. అలాగే భూగేని చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని , అక్కడ ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేసి జలజీవన్ మిషన్ కింద ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేయిస్తామన్నారు. పార్టీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, మాజీ సాగు నీటి సంఘం అధ్యక్షుడు ఐరన్‌గల్ శ్రీనివాస రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, హొళగుంద కోసిగయ్య, వక్రాని వెంకటేశ్వర్లు, బండ్ల గోవిందు, మంగమ్మ, ముకుంద కృష్ణమూర్తి, బుళ్లి నరసింహులు, రహీమ్, మహ్మద్, సోపి రజాక్ పాల్గొన్నారు.

కొలువుదీరిన 'బార్' నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఆదోని రూరల్ : ఆదోని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం కొలువుదీరింది. ఇటీవల ఏకగ్రీవమైన ఆదోని బార్ ఎన్నికల్లో న్యాయవాదులందరూ కలిసి చరిత్రాత్మక నిర్ణయం తీసుకుని 95 శాతం మేరకు మహిళా న్యాయవాదులకు అవకాశం కల్పించారు. సోమవారం కొత్త పాలకవర్గం కొలువుదీరగా, తేనేటి విందు కార్యక్రమాన్ని స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ మాట్లాడుతూ మహిళా న్యాయవాదులకు అవకాశం కల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు. మహిళలకు అవకాశం కల్పించి ఆదోని బార్ విశిష్టతను మరింతగా పెంచారని కొనియాడారు. సీనియర్ సివిల్ జడ్జి, ఇతర న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు ఢీ .. ముగ్గురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన వ్యక్తి

ఉంగుటూరు(గన్నవరం): చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామానికి చెందిన ఎం.హరినాథరావు సోమవారం సాయంత్రం మినీ లారీలో టైర్ల లోడుతో ఏలూరు వైపు బయలుదేరాడు. అదే సమయంలో కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం పాతూరు గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్ మరొకరితో కలసి కారులో ఏలూరు నుంచి విజయవాడ వైపు వేగంగా వస్తున్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు కనకదుర్గ ఆలయం సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను దాటుకుని ఏలూరు వైపు వెళ్తున్న మినీ లారీని బలంగా ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో రెండు వాహనాల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. లారీ, కారు డ్రైవర్లకు కాళ్లు విరిగాయి. కారులో రంజిత్‌కుమార్ పక్కన కూర్చున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను పోలీసులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యం

ఆదోని టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఇద్దరు, వార్డులలో వీధిలైట్లు వెలగడంలేదని ఒకరు, నూతన గ్రంథాలయ భవనం నిర్మించేందుకు స్థలం చూపాలని కోరుతూ ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. కేవీఆర్ కాలనీ, వైఎస్సార్ నగర్, కల్లుబావి, తిమ్మారెడ్డి సర్కిల్ ఏరియాలో వ్యాపార దుకాణాలకు పన్నులు విధించాలని కొందరు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. పైపు లైన్ లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని, ఎండాకాలం కావడం వల్ల కొన్ని వీధుల్లో వారానికి ఒకసారి నీరు సరఫరా అవుతోంని, ప్రజల అవసరం మేరకు నీటిని విడుదల చేయాలని పలువురు కోరారు. ఆర్ఓ, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్, సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- సోమవారం వచ్చిన అర్జీలను శనివారం లోపు పరిష్కారమయ్యేటట్లు చర్యలు తీసుకోవాలి
- రీ సర్వే సమస్యలకు ప్రత్యేక మొబైల్ మెజిస్ట్రేట్
- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



స్పందన కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. డివిజన్‌లో ఇప్పటివరకు రీ సర్వే ఎనిమిది మండలాల్లోని 58 గ్రామాల్లో 1,13,253 ఎకరాలు పూర్తి చేశామన్నారు. రీ సర్వేలో ఏదైనా సమస్యలు వస్తే సంవత్సరంలోపు ఆ మండలానికి సంబంధించి మొబైల్ మెజిస్ట్రేట్ లేదా రీ సర్వే ఉప తహసీల్దార్ అప్పీల్ చేసుకోవచ్చన్నారు.

స్పందనకు వచ్చిన సమస్యల్లో కొన్ని..

- మండగిరి గ్రామానికి చెందిన వై.అంజినమ్మకు సంబంధించిన ఆదోని మండలం నెట్టేకల్ గ్రామంలో సర్వే నంబర్138బీ లో 50 సెంట్ల విస్తీర్ణం వారసత్వ రీత్యా సంక్రమించిందని ఆన్‌లైన్‌లో ఆర్ఓఆర్ అండగల్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఎస్.తాతరాజుకు సంబంధించి సర్వే నంబర్ 51/1లో 8.15 ఎకరాల పైకి 1.50 ఎకరాల భూమి ఉందని, ఆ భూమికి సంబంధించి సబ్ డివిజన్ చేసి హద్దు చూపాలని అర్జీ అందజేశారు.
- పట్టణంలోని టీజీఎల్ కాలనీకి చెందిన అప్సర్ బాషాకు సంబంధించి ఆదోని మండలం మండగిరి గ్రామంలో సర్వే నంబర్ 335/ఏ5లో 1.18 ఎకరాల భూమి ఉందని, గతంలో ఒక ఎకరా విక్రయించామని, మిగిలిన 18 సెంట్లు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.
- పెద్దహరివాణం గ్రామానికి చెందిన డి.రాజశేఖర్‌కు సంబంధించి సర్వే నంబర్ 699/ఏ13లో అక్రమంగా మ్యుటేషన్ చేసుకున్న వారిని ఆర్ఓఆర్ చట్టం ప్రకారం మంజూరు చేసిన పట్టాదారు పాసు పుస్తకం రద్దు చేయాలని అర్జీ సమర్పించారు.

కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందసింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.

వంతెన ప్రారంభించాలి

ఆదోని రూరల్ : తుంగభద్ర నదిపై నిర్మించిన వంతెనను ప్రారంభించాలని ప్రభుత్వ హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆదోని మెంబర్ నసీరుద్దీన్ పటేల్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్‌లో కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నాగలదిన్నె గ్రామం వద్ద తుంగభద్ర నదిపై నిర్మించిన బ్రిడ్జి నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో నది దాటేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెన ప్రారంభిస్తే హైదరాబాద్ వెళ్లే వారికి 35 నుంచి 50 కి.మీ. ప్రయాణం ఆదా అవుతుందని చెప్పారు.

24న మార్కెట్ల వేలం

కోసిగి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన 2023–2024కు సంబంధించి ఈనెల 24వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కుమారి అయ్యమ్మ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని వారపు సంత, బండి మెట్ట, రహదారి రుసుము, చిన్న కమేళ, పెద్దకమేళలకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాల్గొనే వారు పంచాయతీ నిబంధనల ప్రకారం ముందుగా డిపాజిట్ చెల్లించాలని సూచించారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ట్యాంక్ సరే.. కనెక్షన్ ఏదీ?

ఆదోని అర్బన్ : పట్టణంలోని విక్టోరియాపేటలో ఐదు నెలల క్రితం ట్యాంకు ఏర్పాటు చేసి బోరుకు మోటార్ బిగించి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో ట్యాంక్ నిరుపయోగంగా మారింది. పలుమార్లు మున్సిపల్ అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు ట్యాంకును వినియోగంలోకి తెచ్చి వేసవిలో నీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కుళాయి కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన ట్యాంకు

వేలం..మళ్లీ వాయిదా

- సర్కారు వారి పాటను తగ్గించాలని కాంట్రాక్టర్ల వినతి



వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆదోని టౌన్ : ఆదోని మున్సిపాలిటీకి యేటేటా లక్షలాది రూపాయల ఆదాయం సమకూర్చే వివిధ మార్కెట్ల వేలం పాటలు మళ్లీ వాయిదా పడ్డాయి. సోమవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం పాటలు జరిగాయి. మార్కెట్‌లను దక్కించుకునేందుకు కాంట్రాక్టర్‌లు పోటాపోటీగా పాల్గొన్నారు. ఆయా మార్కెట్‌లకు సంబంధించి అధికారులు సర్కారువారి పాటను 10 నుంచి 15 శాతం పెంచడంతో కాంట్రాక్టర్‌లు తమకు నష్టాలు వస్తాయని, పాటను తగ్గించాలని అధికారులను కోరారు. ఈ మేరకు కమిషనర్ రఘునాథ్‌రెడ్డితో చర్చలు జరపగా విఫలమవడంతో వేలాలు వాయిదా పడ్డాయి. మళ్లీ ఈనెల 25వ తేదీకి నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌ను దక్కించుకునేందుకు ఆరుగురు కాంట్రాక్టర్‌లు వేలంలోపాల్గొన్నారు. పశువుల సంత, కమేళాకు ఐదుగురు, గొర్రెలు, మేకల సంత కమేళాకు ముగ్గురు పోటీపడ్డారు. అయితే అధికారులు ఒక్కసారిగా సర్కారువారి పాటను అమాంతంగా పెంచి వేయడంతో నష్టాలు వస్తాయని కాంట్రాక్టర్‌లు కమిషనర్‌కు వివరించారు. తమ చేతుల్లో ఏమీలేదని, ప్రభుత్వ ఆదేశాల మేరకే తాము వేలం నిర్వహిస్తున్నామని కమిషనర్ వివరించినా కాంట్రాక్టర్లు వేలం పాటలో పాల్గొనకుండా వెళ్లిపోయారు. సర్కారువారి పాటను తగ్గించాలని, ఝాన్సీ లక్ష్మీభాయి మార్కెట్‌పరిధిలో లారీకి సుంకం వసూలు చేసుకునేలా అనుమతినివ్వాలని కాంట్రాక్టర్‌లు అధికారులకు విన్నవించారు. అయితే నిబంధనలు ఒప్పుకోవని అధికారులు స్పష్టం చేశారు. సోమవారం సాక్షి దిన పత్రికలో 'వేలం జరిగేనా' అనే శీర్షికతో కథనంలో కాంట్రాక్టర్లు రింగై ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రచురితమవడంతో అధికారులు పకడ్బందీగా వేలాలు చేపట్టారు. అయినా కాంట్రాక్టర్లు తమ పట్టు నిలుపుకునేందుకు యత్నించి సఫలమయ్యారని పలువురు పేర్కొంటున్నారు.

ఈరన్న స్వామికి బంగారం విరాళం





దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం, పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి సోమవారం ఓ భక్తుడు 10 గ్రాముల బంగారం విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. ఎమ్మిగనూరు వాస్తవ్యులు నరహరిరెడ్డి బంగారపు చిన్నగట్టు 10 గ్రాముల బంగారాన్ని దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. దాతకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డు, బాండ్ స్వామి ఫోటో అందజేశారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు

ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం అమావాస్య కావడంతో భక్తులు సోమవారం నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

విజయవంతం చేయండి

ఆదోని రూరల్ : ఎస్సీ వర్గీకరణను పట్టించుకోని బీజేపీకి వ్యతిరేకంగా ఈనెల 27, 28వ తేదీల్లో చేపట్టే ఛలో ఢిల్లీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ గుమ్మల బాలస్వామి మాదిగ, పట్టణ నాయకులు వి.మణికంఠ కోరారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్ 3న బీజేపీ కార్యాలయం ముట్టడి, 4న రాజధాని అమరావతి ముట్టడి చేపడతామన్నారు. అమరావతి నరసింహులు, సీనియర్ నాయకులు మల్లెపోగు తారానాథ్, కాంతరాజు, ఇస్రాయెల్, మదిరె అంజి పాల్గొన్నారు.